హమాలీబస్తీలో తొలగిన చెత్తకుప్పలు



చెత్తకుప్పలు తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

సికింద్రాబాద్: మెట్టుగూడ డివిజన్ హమాలీబస్తీ రహదారులపై గుట్టలుగా పేరుకుపోయిన చెత్తకుప్పలను జీహెచ్ఎంసీ సిబ్బంది ఆదివారం తొలగించారు. హమాలీబస్తీలోని పలు ప్రాంతాల్లో చెత్తకుప్పలు తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నాయని, విషజ్వరాలు వ్యాపిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని 'హమాలీబస్తీలో చెత్తకుప్పలు తొలగించండి అనే శీర్షికతో 'సాక్షి' శనివారం కథనం ప్రచురితమైంది. దీంతో ఈ కథనానికి జీహెచ్ఎంసీ అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో స్పెషల్‌డ్రైవ్ చేపట్టి చెత్తకుప్పలను తొలగించారు. సమస్య పరిష్కరించేందుకు కృషి చేసిన సాక్షి యాజమాన్యానికి, స్పందించిన జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బందికి మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకుడు దావా శివప్రసాద్‌మాదిగ కృతజ్ఞతలు తెలిపారు.

ది హైదరాబాద్ జింఖానా డైరెక్టర్‌గా సదాశివయాదవ్



సనత్‌నగర్: ది హైదరాబాద్ జింఖానాకు ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో డైరెక్టర్‌గా సనత్‌నగర్‌కు చెందిన కంజర్ల సదాశివయాదవ్ ఎన్నికయ్యారు. గూడురు శివరామకృష్ణ ప్యానెల్‌లో ఉన్న ఆయన డైరెక్టర్‌గా గెలుపొందారు. క్లబ్ ద్వారా చేపట్టే సామాజిక సేవా కార్యక్రమాల్లో తనవంతు భాగస్వామ్యం వహించనున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: ఉచిత వైద్య శిబిరాలతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. బన్సీలాల్‌పేట డివిజన్‌లోని మేకలమండిలోని ప్రభుత్వ పాఠశాలలో బద్రి విశాల్ పన్నాలాల్ పిట్టి, అగర్వాల్ సేవాదళ్ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, నిర్వాహకులు శరత్‌పిట్టి, దీపక్‌గుప్తా, ప్రదీప్ అగర్వాల్, సుధీర్‌గుప్తా, నిఖిల్, బీఆర్ఎస్ నాయకులు వెంకటేషన్‌రాజు, లక్ష్మీపతి, ఏసూరి మహేశ్, మహేందర్‌గౌడ్, కుమార్ యాదవ్, అంబులెన్స్ సురేష్ పాల్గొన్నారు.

26 నుంచి హ్యాండ్‌బాల్ నేషనల్ చాంపియన్ షిప్-2025

సనత్‌నగర్: నిజాం కళాశాల గ్రౌండ్‌లో ఈ నెల 26 నుంచి 29 వరకు 17వ హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (హెచ్ఎఫ్ఐ) హ్యాండ్‌బాల్ నేషనల్ చాంపియన్‌షిప్-2025ను నిర్వహిస్తున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి వెల్లడించారు. బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఛాంపియన్‌షిప్-2025 వివరాలను ఆయన అసోసియేషన్ సభ్యులతో కలిసి వెల్లడించారు. భారతదేశం నలుమూలల నుంచి 29 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి మొత్తం 72 బాలబాలికల టీమ్‌లు హాజరవుతున్నట్లు వివరించారు. ఈ పోటీల్లో మొత్తం 1200 మంది పాల్గొంటున్నట్లు చెప్పారు. ఇందులో ఎంపికైన వారు ఒలంపిక్స్‌లో ఆడే అవకాశం ఉంటుందన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, సంయుక్త కార్యదర్శి రమేశ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వెంకట రాంరెడ్డి, కార్యదర్శి తిరుమల్‌రెడ్డి, వరంగల్ అధ్యక్షుడు సాంబయ్య, రెఫిరి బోర్డు కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమానస్పద స్థితిలో విద్యార్థి మృతి

అమీర్‌పేట: బీఎస్సీ విద్యార్థి అనుమానస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట డివిజన్ లీలానగర్‌లోని ఆశ్రయ అపార్ట్‌మెంట్స్‌లో అబ్దుల్ హఫీజ్ కుటుంబం నివాసముంటుంది. అబ్దుల్ పెద్ద కుమారుడైన షేక్ అబ్దుల్ ముఖీద్ (18) బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సాయంత్రం గ్రౌండ్ ఫ్లోర్‌లో ముఖీద్ రక్తపు మడుగులో పడి కనిపించాడు. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న సిబ్బంది యువకుడిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి వచ్చి విచారణ చేశారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి అప్పగించారు.

పెరుగుతున్న దూరాభారం

అప్రోచ్ రోడ్ల ప్రవేశాలపై ఆంక్షలు • అంతరిస్తున్న రైల్వే కాలనీలు

సికింద్రాబాద్: రైల్వే ఉద్యోగుల నివాసాలు, సాధారణ ప్రజల సమ్మేళనంగా ఉన్న సికింద్రాబాద్ భౌగోళిక పరిస్థితులు మారుతున్నాయి. రైల్వే కాలనీలు, కార్యాలయాలు, స్టేషన్ల సమాహారం దశలవారీగా రైల్వే కాలనీలు మాయమవుతున్నాయి. దరిమిలా రైల్వే కాలనీలు, స్థలాల మీదుగా ఉన్న అప్రోచ్ రోడ్లు మూసుకుపోతున్నాయి. తాజాగా చిలకలగూడ, హమాలిబస్తీలోని పలు అప్రోచ్ రోడ్లను రైల్వే అధికారులు మూసివేశారు.

- సికింద్రాబాద్ ప్రజలకు ఉపయుక్తంగా ఉన్న రహదారుల మీదుగా రాకపోకలు నిలిచిపోతుండడంతో ప్రత్యామ్నాయ మార్గాల గుండా రాకపోకలు సాగించడం దూరాభారంగా మారుతోంది. మెట్టుగూడ, తార్నాక ప్రాంతాల్లో ఇప్పటికే పలు అప్రోచ్‌రోడ్లను మూసివేసిన రైల్వే అధికారులు తాజాగా చిలకలగూడ, హమాలిబస్తీ ప్రాంతాల్లో 6 రోడ్లను మూసివేశారు. ముమ్ముందు ఈ రోడ్లను మూసి వేసేందుకు సమాయత్తం అవుతున్నారు.

రైల్వే స్థలాలు ప్రైవేట్ పరం

దశాబ్దాల క్రితం నిర్మించిన రైల్వే క్వార్టర్లు క్రమేణా శిథిలావస్థకు చేరుకున్నాయి. శిథిలావస్థకు చేరుతున్న క్వార్టర్లను రైల్వే అధికారులు నేలమట్టం చేస్తూ వస్తున్నారు. ఖాళీ ప్రదేశాలుగా మారుతున్న సదరు స్థలాల చుట్టూ అధికారులు ప్రహరీలు నిర్మిస్తున్నారు. పనిలో పనిగా ఆయా కాలనీల్లోంచి లోగడ కొనసాగిన అప్రోచ్ రోడ్లను కూడా మూసివేస్తున్నారు. మైదానాలుగా మారుతున్న రైల్వే క్వార్టర్లు, కాలనీల స్థలాల్లో కొన్నింటిని రైల్వే అధికారులు పరిరక్షిస్తున్నారు. ఇంకొన్ని స్థలాలను ప్రైవేట్ కంపెనీలకు లీజుకు ఇచ్చేశారు.

ఎదురవుతున్న ఇబ్బందులు

సికింద్రాబాద్ ప్రాంతం మొత్తంగా రైల్వే స్థలాలు,



చిలకలగూడలో రైల్వే అధికారులు తాజాగా మూసేసిన అప్రోచ్ రోడ్లు

కాలనీలు ఆవరించి ఉన్నాయి. మెట్టుగూడ, తార్నాక, అడ్డగుట్ట డివిజన్ల పరిధిలో రైల్వేశాఖకు చెందిన ఎక్కువ కాలనీలు ఉన్నాయి. దశాబ్దాల కాలం నుంచి రైల్వే రోడ్ల మీదుగా ఆయా పరిసర ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగించేవారు. పాఠశాలలకు, కార్యాలయాలకు వెళ్లడం కోసం రైల్వే రహదారులను వందలాది మంది సాధారణ ప్రజలు వినియోగించుకునేవారు. రైల్వే అప్రోచ్ రోడ్లను వినియోగానికి అలవాటు పడిన లష్కర్ ప్రజలకు తాజాగా అవే మార్గాల గుండా ప్రవేశాల మూసివేత వ్యవహారం ఇబ్బందికరంగా



శిథిలావస్థకు చేరిన సికింద్రాబాద్ రైల్వే క్వార్టర్లు

మారుతుంది. హమాలిబస్తీ-చిలకలగూడ కూడలి, విజయపురికాలనీ-రైల్వే ఆస్పత్రి, లాలాగూడ-మారేడుపల్లి అప్రోచ్ రోడ్లను రైల్వే అధికారులు మూసివేయడంతో ఈ ప్రాంత ప్రజలు ప్రధాన రహదారులకు వెళ్లడం కోసం కిలోమీటర్ల మేర దూరం తిరిగి రావాల్సి వస్తుంది. రైల్వే క్వార్టర్లు నేలమట్టం చేసిన పలు స్థలాలను రైల్వే అధికారులు ప్రైవేట్ సంస్థలకు లీజుకు ఇచ్చారు. సదరు స్థలాల్లో లీజుదారులు నిర్మాణం పనులు ప్రారంభిస్తే సికింద్రాబాద్ ప్రాంతంలోని మరిన్ని అప్రోచ్ రోడ్లు మాయమైపోనున్నాయి.

అప్రోచ్ రోడ్లు పునరుద్ధరించాలి

రైల్వే అధికారులు ఎడాపెడా రోడ్లు మూసివేస్తుండడంతో పరిసర ప్రాంతాలకు వెళ్లి రావడం కోసం అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ముమ్ముందు అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు కూడా నేరుగా తమ కాలనీలకు చేరుకునే పరిస్థితి లేదని చెబుతున్నారు. ప్రజల సంక్షేమం కోసం రైల్వే అప్రోచ్ రోడ్లను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

- ఇదిలా ఉండగా రైల్వే స్థలాల మీదుగా రాకపోకల కోసం సాధారణ ప్రజల రాకపోకలకు అనుమతిస్తే సమస్యలు సృష్టిస్తున్నారని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు. మరికొందరు రైల్వే స్థలాలను చెత్త డంపింగ్ కేంద్రాలుగా మార్చుతున్నారని చెబుతున్నారు. అల్లరిమూకల సంచారాలు, అలజడిని కట్టడి చేయడం కోసం అప్రోచ్ రోడ్ల ప్రవేశాలపై ఆంక్షలు విధిస్తున్నామని వారు స్పష్టం చేస్తున్నారు.

పార్టీ కోసం అంకితభావంతో పనిచేయాలి

మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్

రాంగోపాల్‌పేట్: బీజేపీలో పదవులు పొందిన వారు పార్టీ కోసం మరింత అంకితభావంతో పనిచేయాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. పార్టీ కోసం పనిచేస్తున్న వారిని విస్మరించకుండా వారికి తగిన ప్రాధాన్యతనిస్తుందని ఆయన అన్నారు. ఇటీవల సికింద్రాబాద్ గురుద్వారా కార్యదర్శి సర్దార్ జగన్మోహన్‌సింగ్‌కు బీజేపీ రాష్ట్ర బీజేపీ మైనార్టీ మోర్చా అధ్యక్షుడిగా నియమితులైన ఆయనను సికింద్రాబాద్ గురుద్వారాలో అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈటల రాజేందర్ ఆయనను



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొంతం దీపిక, ప్రబంధక్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చదువు మధ్యలో నిలిచిపోవద్దు



చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: ఆర్థిక ఇబ్బందులతో ప్రతిభావంతులైన విద్యార్థుల చదువు మధ్యలో నిలిచిపోవద్దని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్‌లోని ఈ-లైబ్రరీలో ఆదివారం సంకేత్ సోషల్ అవేర్‌నెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 14 మంది పేద విద్యార్థులకు రూ.3.06 లక్షల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సహాయం అందిస్తున్న సంకేత్ ఆర్గనైజేషన్ నిర్వాహకులను అభినందించారు. సంకేత్ సోషల్ అవేర్‌నెస్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు మురళి మాట్లాడుతూ ఈ స్వచ్ఛంద సంస్థను నెలకొల్పి 9 ఏళ్లు అవుతుందని, ఇప్పటివరకు 57 మంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్పులను అందించామన్నారు. ఈ ఏడాది 14 మంది విద్యార్థులకు రూ.3.06 లక్షలు అందించడంతో పాటు బేగంపేట ప్రభుత్వ పాఠశాల, సనత్‌నగర్ ప్రభుత్వ రౌండ్‌టేబుల్ పాఠశాలలకు అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను సమకూర్చమన్నారు. ఇప్పటివరకు రూ.16,87,000ల విలువైన స్కాలర్‌షిప్పులు ఇచ్చామన్నారు. కార్యక్రక్రమంలో బీఆర్ఎస్ నేతలు బాల్‌రెడ్డి, ఖలీల్‌బేగ్, సురేష్‌గౌడ్, శేఖర్, ఫాజిల్, పురుషోత్తం, రాజేష్‌ముదిరాజ్, జమీర్, సంకేత్ సంస్థ నిర్వాహకులు మురళి, మమత, ధనశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మాలల రణభేరీ మహాసభను విజయవంతం చేయాలి

లాలాపేట: పరేడ్ గ్రౌండ్‌లో నవంబర్ 2న మాలల రణభేరీ మహాసభను విజయవంతం చేయాలనీ మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య పిలుపునిచ్చారు. ఆదివారం తార్నాక డివిజన్ లాలాపేటలో మాల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చెన్నయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సంఘం పటిష్టతకు గ్రేటర్ హైదరాబాద్‌లో అన్ని ప్రాంతాల్లో మాల సంఘం కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అశాస్త్రీయంగా చేసిన ఎస్సీ వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. అనంతరం మాల మహానాడు తార్నాక డివిజన్ ప్రధాన కార్యదర్శిగా చింతల్‌కు చెందిన ఎం. రాజయ్య(చిన్న)ను నియమించారు. ఈ సందర్భంగా తార్నాక డివిజన్ మాల సంఘం ప్రధాన



నియామక పత్రం అందజేస్తున్న చెన్నయ్య

కార్యదర్శి రాజయ్య మాట్లాడుతూ మాలల రణభేరీ మహా సభకు వేలాదిగా తరలి వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో తుంగ లక్ష్మణ్, హరిబాబు, మహేశ్, మనోహర్, నర్సింగరావు, లక్ష్మీనారాయణ, ప్రసాద్, కరుణాకర్, ప్రసన్న తదితరులున్నారు.

ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు



ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్: నిరుపేదలకు ఉచితంగా వైద్య సేవలను అందించేందుకు తాము నిరంతరం శ్రమిస్తున్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ అన్నారు. బౌద్ధనగర్ ఎస్ఆర్‌వీ మల్టీ స్పెషాలిటీ క్లినిక్‌లో ఆదివారం మెగా ఉచిత వైద్య

సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని పద్మారావుగౌడ్ ప్రారంభించి, ఉచితంగా మందులను రోగులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య సేవలను అందించే వ్యక్తులు, సంస్థలను ప్రోత్సహిస్తామని తెలిపారు. ఎస్ఆర్‌వీ మల్టీ స్పెషాలిటి క్లినిక్‌తో పాటు విబ్సున్ ఫార్మా, సుంకు ట్రస్ట్ వంటి వివిధ సంస్థల ద్వారా వివిధ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సుంకు రామచందర్ తెలిపారు. ఖరీదైన వైద్య పరీక్షలతో పాటు రోగులకు ఖరీదైన మందులు కూడా పూర్తిగా ఉచితంగా ఈ శిబిరంలో అందించేలా ఏర్పాట్లు జరిపామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కంది శైలజ, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

యూరియాను అందించడంలో కాంగ్రెస్ విఫలం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్‌గౌడ్

బౌద్ధనగర్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సమయానికి యూరియాను అందించడంలో విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ రైతులు రోజూ యూరియా కోసం కేంద్రాల వద్ద క్యూలైన్లలో నిలబడి వేచిచూసినా.. ఆఖరికి కొంతమంది ఖాళీ చేతులతోనే వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని చెబుతున్నా.. రైతులకు ఎందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అవసరానికి మించి యూరియా పంపిణీ చేసిందని, రాష్ట్రంలో కృత్రిమ కొరతకు కారణం ఏంటనే దానిపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే యూరియా నిల్వల వివరాలను వెల్లడించి, నిల్వలను బ్లాక్ మార్కెట్‌కి తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సనత్‌నగర్: జెక్‌కాలనీలోని పార్థివ్ లంగ్‌కేర్ సెంటర్ ఆధ్వర్యంలో మూసాపేట అంజనేయనగర్‌లోని జీహెచ్ఎంసీ పార్కులో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. దాదాపు 200 మంది వైద్య శిబిరంలో పాల్గొని వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పార్థివ్ లంగ్‌కేర్ సెంటర్ ఎండీ, ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో డాక్టర్ విరూప, మేనేజర్ శ్రీనివాస్‌ల బృందం వైద్య సేవలను అందించారు. ముఖ్యంగా ఈఎన్‌టీ, పల్మనాలజీ, జనరల్ మెడిసిన్, గైనకాలజీ సమస్యలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి మందులు, వారికి ఆరోగ్య జాగ్రత్తలను వైద్యులు వివరించారు. ఈ శిబిరానికి బాలాజీనగర్ కార్పొరేటర్ శిరీషబాబురావు హాజరై నిర్వాహకులను అభినందించారు.

యోగా సాధనతో అనేక లాభాలు





యోగాసనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

లాలాపేట: యోగా సాధనతో అనేక లాభాలు ఉన్నాయని, ఓయూలో ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ వాళ్ల సహకారంతో యోగాలో పీజీ డిప్లమా లాంటి అడ్వాన్స్ కోర్సులను ఇంప్లిమెంట్ చేయడానికి కచ్చితంగా సహకరిస్తామని జూనియర్ డైరెక్టర్ డా.సోమేశ్వర్ పోలే అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో(ప్రొ.రామ్‌రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్) యోగా సర్టిఫికెట్ కోర్సు కంప్లీట్ అయిన సందర్భంగా (పూర్ణాహుతి)ఫేర్‌వెల్ డేను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గెస్ట్ ఆఫ్ హానర్స్‌గా జూ. డైరెక్టర్ డా.సోమేశ్వర్ పోలే, రవీంద్రనాథ్ కె మూర్తి ప్రిన్సిపాల్ యూసీఈఓయూ అండ్ హెచ్ఓడీ డిపా

జూనియర్ డైరెక్టర్ డా.సోమేశ్వర్ పోలే

ర్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్, కోఆర్డినేటర్ సీసీ ఇన్ యోగా డా.లలిత హాజరయ్యారు. యోగా విద్యార్థులు చేసిన విన్యాస యోగా వీక్షకులను ఆకట్టుకుంది. అనంతరం కోఆర్డినేటర్ సీసీ ఇన్ యోగా డా.లలిత మాట్లాడుతూ.. భారతదేశంలోని సనాతన ధర్మంలో యోగా ఫిలాసఫీని అందరూ ఆచరించాలన్నారు. అలాగే అతి త్వరలోనే పీజీ డిప్లమా కోర్సు కూడా యూనివర్సిటీలో తీసుకురావడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రిసోర్స్ యోగా టీచర్ కిషోర్ మాట్లాడుతూ.. ఆయుర్వేదం, భగవద్గీత చెప్పిన ఆహార విహారాలను పాటించాలని, యోగ సాధనను సమాజంలో ప్రతీ ఇంటికి చేర్చాలని యోగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రతినిధులు అసిస్టెంట్ ప్రొ. డా.సుజాత, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ధర్మతేజ, అసిస్టెంట్ ప్రొ.డా.సునీత, డా.అసిస్టెంట్ ప్రొ. దుర్గేశ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ యూసీఓయూ డా.కృష్ణయ్య, రిసోర్స్ యోగా అధ్యాపకులు ప్రతిభా, రోజినా, కిషోర్, కిషన్ బత్తిని, వినోద్, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. ముంచెత్తిన వరద



రెజిమెంటల్‌బజార్‌లోని కాలనీలోకి వచ్చిన వరద నీరు

రాంగోపాల్‌పేట్: ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో సికింద్రాబాద్‌లోని లోతట్టు ప్రాంతాలు వరద నీటిలో మునిగాయి. రెజిమెంటల్ బజార్, 31బస్టాప్, మోండా మార్కెట్, తదితర ప్రాంతాల్లో వరద నీరు ముంచెత్తింది. అలాగే ఎస్పీరోడ్, ఎంజీరోడ్, ఆర్పీరోడ్, ఎస్డీరోడ్‌లపైకి వర్షం నీరు వచ్చి చేరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో వర్షం నీరు షాపుల్లోకి వచ్చింది. దీంతో షాపుల్లో సామగ్రి



రోడ్డు మధ్యలో నీళ్లలో పడుకున్న మందుబాబు

మునిగిపోయింది. దీంతో షాపుల యజమానులు నీటిని బయటకు పంపించేందుకు నానా అవస్థలు పడ్డారు.

- ఒకవైపు భారీ వర్షం...పడుతుండగా ఓ వ్యక్తి మద్యం మత్తులో గోపాలపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ముందు నడి రోడ్డులో వరద నీటిలో పడుకున్నాడు. అటువైపు వెళ్తున్న ప్రజలు అతన్ని చూసి నవ్వుకున్నారు.

మిలాద్-ఉన్-నబీ.. వైభవంగా ర్యాలీ



వారాసిగూడలో బందోబస్తు నిర్వహిస్తున్న ఏసీపీ శశాంక్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు అనుదీప్, మధుసూదన్‌రెడ్డి

చిలకలగూడ: మహ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకొని ఆదివారం నిర్వహించిన మిలాద్-ఉన్-నబీ ర్యాలీ వేడుకగా సాగింది. ముస్లిం మతపెద్దలు, నాయకులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై మతపరమైన జెండాలతో నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్లారు. వారాసిగూడ నుంచి షాబాద్‌గూడ, మహ్మద్‌గూడ, మొరంబండ, పద్మారావునగర్, నైవేద్యం హోటల్, చిలకలగూడ చౌరస్తా, గాంధీ స్టాచ్యూ, మైలార్‌గడ్డ, సీతాఫల్‌మండి, నామాలగుండు మీదుగా మిలాద్ ర్యాలీ కొనసాగింది. చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు అనుదీప్, మధుసూదన్‌రెడ్డి, డీఐ రమేష్‌గౌడ్‌లు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ మిలాద్ ర్యాలీలో పాల్గొన్నారు.

లాలాగూడ మసీదు కమిటీ ఆధ్వర్యంలో..

అడ్డగుట్ట: మిలాద ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని లాలాగూడ బడీ మసీదు కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాలు పట్టుకొని లాలాగూడ, శాంతినగర్ ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంఏ హాషమ్, గఫూర్, ఖయ్యూమ్, నజీరుద్దీన్, అజీమ్, జాఫర్, ఖాజా, నాయకులు పాల్గొన్నారు.

శాంతినగర్‌లో ..

లాలాపేట: తార్నాక డివిజన్ శాంతినగర్‌లో మిలాద్ ఉన్ నబీ వేడుకలు డివిజన్ సీపీఐ కార్యదర్శి సయ్యద్ గౌస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

కౌసర్ మసీదు నుంచి భారీ ర్యాలీ

బౌద్ధనగర్: మిలాద్-ఉన్-నబీ వేడుకలు ఆదివారం బౌద్ధనగర్‌లో ఘనంగా జరిగాయి. వారాసిగూడ కౌసర్ మసీదు నుంచి పద్మారావు నగర్, చలకలగూడ చౌరస్తా, సీతాఫల్‌మండి తిరిగి వారాసిగూడ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. మిలాద్-ఉన్-నబీ వేడుకలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగే విధంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఏసీపీ శశాంక్‌రెడ్డి తెలిపారు. వారాసిగూడ, చిలకలగూడ పోలీస్‌స్టేషన్ల నుంచి దాదాపు



చిలకలగూడ ఠాణా పరిధిలో జరిగిన మిలాద్ ర్యాలీలో యువకులు

100 మంది సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బందోబస్తులో ఏసీపీ శశాంక్‌రెడ్డితో పాటు ఇన్‌స్పెక్టర్లు అనుదీప్, మధుసూదన్‌రెడ్డి, డీఐ రమేష్‌గౌడ్, ఎస్సైలు సుధాకర్, రాకేష్, మల్లికార్జున్, రామచంద్రారెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్. శ్రీనివాసులు, ఎస్సై శ్రీధర్ పాల్గొన్నారు.

బేగంపేట పోలీస్‌లైన్స్ చౌరస్తాలో..

సనత్‌నగర్: మిలాద్-ఉన్-నబీ వేడుకలను ఆదివారం బేగంపేట పోలీస్‌లైన్స్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అన్నదాన కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యురాలు కోట నీలిమ, సీనియర్ కాంగ్రెస్ నేత విశాల్ సూదం హాజరై ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బేగంపేట ఆటో యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు మహ్మద్ సలీంఖాన్, ప్రధాన కార్యదర్శి కట్టి మణి సిద్ధప్ప, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మిలాద్ ర్యాలీలో కార్పొరేటర్ సామల హేమ, ముస్లిం నాయకులు



లాలాగూడలో బడీ మసీదు కమిటీ ఆధ్వర్యంలో మిలాద్ ర్యాలీ



బేగంపేటలో జరిగిన వేడుకల్లో ఏఐసీసీ సభ్యురాలు కోట నీలిమ, విశాల్ సూదం